క్లుప్తంగా

రైతులు నష్టపోకుండా భూసేకరణ



రైతుల భూములు కొలుస్తున్న సర్వేయర్లు

చిప్పగిరి: మండల కేంద్రం నుంచి దౌల్తాపురం, నంచర్ల మీదుగా మద్దికెర వరకు 13 కి.మీ మేర వేస్తున్న బీటీ రోడ్డులో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. దౌల్తాపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ భూములు రోడ్డు నిర్మాణంలో కోల్పోతున్నాయని అభ్యంతరం వ్యక్తం చేయడంతో సోమవారం సర్వేయర్లు, రజియా, రాము నాయక్ పొలాల వద్దకు వెళ్లి కొలతలు చేపట్టారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే రోడ్డు వేస్తున్నామని, రైతులెవరికీ నష్టం జరగదని సర్వేయర్లు తెలిపారు.

భూవిస్తీర్ణం తగ్గడంపై రైతుల ఆందోళన

తుగ్గలి: రీ సర్వేలో తమ భూముల విస్తీర్ణం తగ్గించడం సరికాదని ఉప్పర్లపల్లి, బాటతండా, సూర్యతండా, అమినాబాద్ రైతులు వాపోయారు. సీపీఎం, రైతు సంఘం మండల కార్యదర్శులు, నాయకులు శ్రీరాములు, కొండారెడ్డిలతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు ఆందోళన చేపట్టారు. రీ సర్వేలో అధికారులు సరిగా కొలతలు వేయకపోవడంతో తమ భూమి విస్తీర్ణం తగ్గిపోయిందన్నారు. ఇష్టానుసారం సర్వేచేసి తమకు అన్యాయం చేశారని, పారదర్శకంగా సర్వేచేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ షర్మిళకు వినతిపత్రం అందజేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● పత్తికొండ పట్టణ సీఐ మురళీమోహన్



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

తుగ్గలి: సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పత్తికొండ టౌన్ సీఐ మురళీ మోహన్ హెచ్చరించారు. సోమవారం జొన్నగిరి, మద్దికెర ఎస్ఐలు రామాంజనేయులు, రమేష్, పోలీసు సిబ్బందితో కలిసి ఉప్పర్లపల్లిలో కార్డన్ సెర్చ్ నిర్వహించి గ్రామస్తులతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాల రోజు, తర్వాత కూడా ఎక్కడా గొడవలకు దిగరాదని సూచించారు. ర్యాలీలు, ఊరేగింపులు, టపాసులు పేల్చడం ఎన్నికల ఫలితాల అనంతరం కూడా నిషేధమని, దీన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. కౌంటింగ్ పూర్తయి ఎన్నికల కోడ్ ముగిసే వరకు గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అనంతరం గొడవలకు వెళ్లబోమని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వడ్డించాలి



ఏజెన్సీ మహిళలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వడ్డించాలని ఎంఈఓ-2 చిరంజీవి రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ ఆవరణంలోని ఎంపీపీ పాఠశాలలో మండలంలోని అన్ని పాఠశాలల వంట ఏజెన్సీ నిర్వాహకులకు ఎంఈఓ కోమలాదేవి ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల విజయవాడలో ట్రైనింగ్ పొందిన వంట నిర్వాహకులతో సూచనలు సలహాలు ఇచ్చారు. ఎల్ఈడీ స్క్రీన్‌పై రోజు వారీ మెనూ వివరాలను చూపించారు. మెనూ ప్రకారం భోజనం వండి వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. రాగి జావ, ఉడికించిన గుడ్డు విద్యార్థులకు తప్పకుండా అందించాలన్నారు. మెనూలో తేడాలు వస్తే ఏజెన్సీ నిర్వాహకులను తొలిగిస్తామని హెచ్చరించారు.

గురుకులంలో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్

కృష్ణగిరి: కంబాలపాడు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో మిగిలిన సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలికల విభాగానికి సంబంధించి ఈ నెల 29న ఉదయం 10 గంటలకు దిన్నెదేవరపాడు పాఠశాలలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షలో ఎస్సీ-19, ఎస్టీ-19, బీసీ-41, ఓసీ-40 మార్కులకుపైగా వచ్చిన వారు మాత్రమే హాజరుకావాలని ఆమె సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ పాఠాలు

- తొలి విడతలో 20 పాఠశాలలు ఎంపిక
- ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు
- జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించే అవకాశం

చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతోందని, వారి కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతాయనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసింది. అందులో భాగంగానే ప్రభుత్వ బడుల్లో కొత్త సంస్కరణలకు నాంది పలికింది. నాడు-నేడు కింద పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పించింది. డిజిటల్ విద్యను అందుబాటులో తెచ్చింది. తాజాగా సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రభుత్వ బడుల్లో బోధించేందుకు చర్యలు చేపట్టింది.



సీబీఎస్ఈ సిలబస్‌కు ఎంపికైన ఆలూరు ప్రభుత్వ బాలుర-1 పాఠశాల

ఆలూరు రూరల్: నియోజకవర్గంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధన అమలు చేయనున్నారు. పిల్లల చదువులో అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేసేందుకు నిర్ణయించింది. ఇందుకోసం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 20 పాఠశాలలను తొలివిడత కింద ఎంపిక చేసింది. బడుల్లో బట్టీ విధానానికి, మూస పద్ధతికి స్వస్తి పలికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ సిలబస్ అమలు చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఎంపిక చేసిన పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చింది.

పేద విద్యార్థులకు ప్రోత్సాహం

ఇప్పటి వరకు కార్పొరేట్, ఇతర ప్రత్యేక పాఠశాలల్లోనే సీబీఎస్ఈ సిలబస్ అమలు అవుతోంది. ప్రస్తుతం నడుస్తున్న పోటీ ప్రపంచంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలంటే సీబీఎస్ఈ సిలబస్ కచ్చితంగా ఉండాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు ఇలాంటి బోధన అందించాలన్న సంకల్పంతో చర్యలు తీసుకుంది. అన్ని రకాల వనరులు ఉండి, పిల్లలు ఎక్కువ సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో దీన్ని ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేస్తున్నారు. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఈ బోధన ద్వారా చదువుకునే అవకాశం ఉంటుంది. ఆయా విద్యాలయాల పర్యవేక్షణ కేంద్రంలో వెళ్తుంది. జేఈఈ, నీట్ లాంటి పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగం. విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు పెంచేలా సిలబస్ ఉంటుంది. విద్యార్థుల ఆసక్తి అభిరుచి గుర్తించి వివిధ రంగాల్లో వారికి ప్రోత్సహిస్తారు. అవసరం మేరకు సబ్జెక్టు టీచర్లను నియమిస్తారు.

సీబీఎస్ సిలబస్ ప్రయోజనాలు

సీబీఎస్ఈ పుస్తకాలు, ఆసక్తిగా విద్యార్థులకు అర్థమయ్యేలా ఉంటాయి. కోర్సుల నిర్మాణం ఒత్తిడికి గురిచేయదు. విద్యార్థికి స్నేహ పూర్వకంగా ఉంటుంది. పోటీ పరీక్షల్లో విద్యార్థులకు విజయం సాధించేందుకు దోహదపడతాయి. యాంత్రిక విద్యకు దూరంగా ఉంటూ.. వాస్తవాలకు దగ్గరగా బోధిస్తారు. పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెద్దగా ప్రాధాన్యం కల్పించరు. సబ్జెక్టుల వారీగా ఏ మేరకు నేర్చుకున్నారన్నది పరీక్షించేలా ప్రశ్నపత్రాలు రూపొందిస్తారు. ఐఐటీ వంటి కేంద్రీకృత సంస్థ నుంచి భవిష్యత్ అధ్యయనాలు, కొనసాగించుకోవాలంటే సీబీఎస్ఈ పాఠ్యాంశాలు సహాయపడతాయి. ఈ సంస్థల ప్రాథమిక పరీక్షలు సీబీఎస్ఈ ఆధ్వర్యంలో మాత్రమే నిర్వహిస్తారు.

సీబీఎస్ఈకి ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలు

ఆలూరు మండలంలో..
మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల-1, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్, అరికెరలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల, మొలగవల్లి జిల్లా పరిషత్ హైస్కూల్.
ఆస్పరి మండలంలో..
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్
చిప్పగిరి: కేజీబీవీ.
హాలహర్వి: కేజీబీవీ.
హొళగుంద: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌తో పాటు హెబ్బటం, ఇంగళదహాల్, గజ్జహల్లి జెడ్పీఎస్ స్కూళ్లు.
దేవనకొండ: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌తో పాటు మండల కేంద్రంలోని కేజీబీవీ, తెర్నేకల్, పి.కోటకొండ జెడ్పీహెచ్ స్కూళ్లు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



ఈ ఏడాది నుంచి తొలి విడతలో ఎంపిక చేసిన ప్రభుత్వ బడుల్లోని సీబీఎస్ఈ సిలబస్ ద్వారా పాఠాలు బోధన ఉంటుంది. కార్పొరేట్ స్థాయిలో అభ్యాసాలు ఉంటాయి. ఇది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతుంది. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఈ విద్య ఎంతగానో ఉపయోగపడుతుంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ వరం. విద్యార్థులు ఈ బోధనను సద్వినియోగం చేసుకోవాలి.

– చిరంజీవి రెడ్డి, ఎంఈఓ-2,ఆలూరు

భూముల కౌలుకు వేలం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని రంగనాథస్వామి ఆలయ భూములను 3 ఏళ్లపాటు కౌలుకు ఈనెల 30న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఛైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు డిపాజిట్ చెల్లించి వేలంపాటల్లో పాల్గొనాలన్నారు. ఆలయానికి పాత బాకీ ఉన్న వారు వేలంపాటల్లో పాల్గొనేందుకు అనర్హులన్నారు. వేలంపాట పాడిన పాటదారుడు వెంటనే కౌలు మొత్తం చెల్లించవలసి ఉంటుందన్నారు.

రైతులకు సాయం పెంచాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని పెంచాలని సీపీఐ మండల కార్యదర్శి టి కృష్ణ, అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు సోమవారం తహసీల్దార్ అనంతాచారికి వినతిపత్రం సమర్పించారు. బ్యాంకులు రైతులకు షరతులు లేకుండా రూ.5 లక్షల వరకు రుణం ఇవ్వాలని, 90 శాతం సబ్సిడీతో అన్ని రకాల విత్తనాలు ఇవ్వాలని, పంటల బీమా సొమ్ము పూర్తిస్థాయిలో అందించాలని, కౌలు రైతులకు సైతం రుణసౌకర్యం కల్పించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు రాజు, చిలిపి కృష్ణ, చిన్న మధు, మనోహర్ పాల్గొన్నారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు

చిప్పగిరి: 2024 విద్యాసంవత్సరం సంబంధించి 1 నుంచి 5వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు సోమవారం మండలానికి చేరాయి. ఎంఈఓ బాలనాయుడు వాటిని పరిశీలించి స్టాక్ రూమ్‌లో భద్ర పరిచారు. జూన్ 12లోపు విడతల వారీగా పుస్తకాలు వస్తాయన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పుస్తకాలను అన్ని పాఠశాలలకు పంపిణీ చేస్తామన్నారు.

తాగు నీటిని సరఫరా చేయాలి

● జిల్లా కలెక్టర్‌ను కలిసిన మండల ప్రజాప్రతినిధులు



కలెక్టర్ వద్ద ఆస్పరి మండల ప్రజాప్రతినిధులు

ఆస్పరి: నాగనాథహళ్లి రిజర్వాయర్ నుంచి మండల పరిధిలోని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలని కోరుతూ మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు సోమవారం కర్నూలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు ఆస్పరిలో విలేకరులతో మాట్లాడారు. 2009లో ఆస్పరి, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, హలిగేర, చిగిళి, బిణిగేరి, నగరూరు గ్రామాలతో పాటు ఆలూరు మండలంలోని కాత్రికి, మూసానహళ్లి, మరకట్టు, కమ్మరచేడు, నారాయణపురం గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు నాగనాథహళ్లి వద్ద రిజర్వాయర్ నిర్మించి పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. కానీ రిజర్వాయర్‌కు ఏమాత్రం సంబంధం లేని ఆదోని మండలం మండగిరి, సాదాపురం, విరుపాపురం, దిబ్బనకల్లు, గోనబావి, విరుపాపురం తదితర గ్రామాలకు నీటిని అక్రమంగా సరఫరా చేస్తుండటంతో తమ గ్రామాలకు తాగు నీటి సమస్య తలెత్తిందన్నారు. స్కీంలో లేని గ్రామాలకు తాగునీటిని సరఫరా నిలిపేసి, తమ గ్రామాలకు నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని కలెక్టర్‌కు విన్నవించామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, చిగిళి ఎంపీటీసీ సభ్యుడు రాధాక్రిష్ణ, బిణిగేరి సర్పంచ్ వెంకటేష్‌తోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు సుంకుర రామాంజనేయులు, పురుషోత్తమరెడ్డి, తిమ్మప్ప, ప్రకాష్ ఉన్నారు.

1న లొద్దిపల్లెలో భజన పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో జూన్ 1వ తేదీ జిల్లా స్థాయి భజన పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హనుమద్‌జయంతి సందర్భంగా శనివారం స్థానిక వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు స్వామివారికి సిద్ధోదక స్నానం, అభిషేకం, సింధూరపు అలంకరణ, కలశస్థాపన, ఆకుపూజ, కుంకుమార్చన పూజలు.. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం..సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం చేయనున్నారు.. అదే రోజు రాత్రి 9 గంటలకు జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహించనున్నారు. తొలి నాలుగు స్థానాల్లో నిలిచే బృందాలకు వరుసగా రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు దాతలు ఆర్.నాగేశ్వరరెడ్డి, నారాయణ రెడ్డి తెలిపారు. ఆసక్తి గల భజన బృందాలు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9704842047, 9849581378 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇద్దరు డీబార్

కర్నూలు(సెంట్రల్) : రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయ్యారు. డోన్ జీవీఆర్ఎస్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో ఒకరు, బేతంచెర్ల శ్రీవివేకానంద డిగ్రీ కాలేజీలో మరొకరు డీబార్ అయ్యారు. కాగా, నాలుగో సెమిస్టర్ సోమవారం జరిగిన పరీక్షకు 89 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 2,995 మంది విద్యార్థుల్లో 2,670 మంది పరీక్ష రాశారు.

దద్దణాల అభివృద్ధికి రూ.14 కోట్లతో ప్రతిపాదనలు



దద్దణాల ప్రాజెక్టు

బనగానపల్లె: మండలంలోని దద్దణాల ప్రాజెక్టు అభివృద్ధికి రూ.14 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు మైనర్ ఇరిగేషన్ ఏఈ రఘురామ్ సోమవారం తెలిపారు. నిధులు మంజూరు కాగానే ప్రాజెక్టుకు చెందిన ఒక గేట్‌ను మార్చడంతో పాటు ఆనకట్ట పటిష్టత, గదుల నిర్మాణం, త్రీఫేజ్ విద్యుత్ సరఫరా, మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రాజెక్టు పరిధిలో 1,513 ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు తెలిపారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

కృష్ణగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా చేయాలని మాస్టర్ ట్రైనర్ సరస్వతి సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం ఆమె మండలంలోని అన్ని పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వహకులకు భోజన తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం విద్యార్థులకు ఒక్కో రోజు ఒక రకంగా మెనూ అమలు చేస్తుందని, దాన్ని పక్కాగా తయారీ చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు, తాజా కూరగాయాలు, ఆకుకూరలు, నాణ్యమైన సరుకులు వాడి రుచికరంగా చేయాలన్నారు. వంటలు చేసే విధానాన్ని వారికి వివరించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ కో-ఆర్డినేటర్ రాజేష్, సీఆర్పీలు కృష్ణమూర్తి, వీరనాగప్ప, శ్యామల, మధు పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

మద్దికెర: 2023-24 సంవత్సరానికి సంబంధించి రబీ పంట నష్ట పరిహారం మంజూరులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఏఓ రవి తెలిపారు. సోమవారం మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రబీ పంట నష్ట పరిహార జాబితాలను ప్రదర్శించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు పంట నష్ట పరిహార జాబితాలో సరిచూసుకొని ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సంబంధిత వ్యవసాయాధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జాకీర్ పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

హొళగుంద: వచ్చే నెల 4న ఎన్నికల ఫలితాల సందర్భంగా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పెద్దయ్యనాయుడు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, నిబంధనలకు విరుద్ధంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

ఆర్‌బీకేలకు చేరిన విత్తనాలు

మద్దికెర: ఖరీఫ్ సీజన్‌లో 40 శాతం సబ్సిడీతో రైతులకు అందజేసే వేరుశనగ విత్తనాలు రైతు భరోసా కేంద్రాలకు చేరాయి. పెరవలి గ్రామ రైతుల కోసం మంజూరైన సబ్సిడీ విత్తనాలను సోమవారం వ్యవసాయ సహాయకులు ఇంద్రజ ఆర్‌బీకేలో నిల్వ ఉంచారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

ఆలూరు: ఎన్నికల కోడ్‌ను ఉల్లఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఆలూరు పోలీసు సర్కిల్ పరిధిలో వివిధ రకాల కేసుల రికార్డులను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరెడ్డి విలేకరులతో మాట్లాడారు. వచ్చేనెల 6 వరకు ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నాయన్నారు. ప్రజలకు విఘాతం కల్గిస్తున్న వారిపై ప్రత్యేక నిఘావేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్సవాలు, ఊరేగింపులకు అనుమతులు లేవన్నారు. కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం రవాణా చేసే వారిని జైల్‌కు పంపుతామన్నారు. ఆయన వెంట సీఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఓబులేశు ఉన్నారు.

గొడవలకు వెళ్లొద్దు

హాలహర్వి: ఎన్నికల ఫలితాలు సందర్భంగా ఎవరూ గొడవలకు వెళ్లొద్దని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రాజకీయ పార్టీల నాయకులతో డీఎస్పీ సమావేశమయ్యారు. ఎన్నికల ఫలితాల సందర్భంగా బాణా సంచా కాల్చినా, సంబరాలు చేసుకున్నా కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్ఐ నరేంద్ర ఉన్నారు.

ఏజెంట్లు నిబంధనలను పాటించాలి



మాట్లాడుతున్న ఆర్ రాముునాయక్

ఆలూరు: వచ్చే నెల 4న ఎన్నికల కౌంటింగ్‌లో రాజకీయా పార్టీ ఏజెంట్లు నిబంధనలను పాటించాలని ఆలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రామునాయక్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఏఆర్ఓ చంద్రశేఖరయ్యతో కలిసి వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ కౌంటింగ్ రోజు ఉదయం 6 గంటలకే కేంద్రాల్లోకి ఏజెంట్లు చేరుకోవాలన్నారు. ఉదయం 7.55 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఫలితాల సందర్భంగా గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. రెండు నెలల నుంచి దాదాపు మూడు వందల మందికిపై బైండోవర్ కేసులను నమోదు చేశామన్నారు. సమావేశంలో సీఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఓబులేశు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక మార్గదర్శకాలు

● ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి నీలపు రామలక్ష్మి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి నీలపు రామలక్ష్మి

పత్తికొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి నీలపు రామలక్ష్మి తెలిపారు. సోమవారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమై కౌంటింగ్ రోజున ఏజెంట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆమె తెలియజేయాలన్నారు. ఫలితాలు వెలువడిన తరువాత గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా రాజకీయ నాయకులు తమ కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాలన్నారు. విజయోత్సవ ర్యాలీలు నిషేధమన్నారు. బెట్టింగ్‌కు పాల్పడితే క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు గురించి డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. జూన్ 6 వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉంటుందన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

భూమిలో తగినంత తేమ ఉంటేనే విత్తుకోవాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న ఏఓ సురేష్‌బాబు

దేవనకొండ: భూమిలో తగినంత తేమ ఉంటేనే విత్తుకోవాలని, అరకొర పదునుకు విత్తుకొని నష్టపోకూడదని ఏఓ సురేష్‌బాబు రైతులకు సూచించారు. సోమవారం ఆయన ఫర్టిలైజర్, విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని డీలర్లను హెచ్చరించారు. విత్తన, ఎరువులను కొన్న రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు.

90 శాతం సబ్సిడీ కింద ఎరువులు అందించాలి

ప్రతి రైతుకు 90 శాతం సబ్సిడీ కింద ఎరువులు, మందులు, విత్తనాలను అందించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ అఖిల భారత రైతు మహాసభ ఆలూరు నియోజకవర్గ కార్యదర్శి బోయ మునిస్వామి సోమవారం ఏఓ సురేష్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లాలుసాహెబ్, షేక్షావలి, లక్ష్మన్న, కౌలుట్ల సోమన్న, నాగరాజు, వలీసాహెబ్‌బాషా పాల్గొన్నారు.

చల్‌చల్ గుర్రం!



తుగ్గలి: రాజుల కాలంలో అశ్వాలకు కొదవలేదు. రాజులు, సైన్యం ఎక్కడికెళ్లాలన్నా అశ్వాలపై స్వారీ చేసేవారు. రాజులు పోయారు, రాజ్యాలు పోయాయి. వాటితో పాటే అశ్వాలూ కనుమరుగయ్యాయి. అక్కడక్కడా చాలా అరుదుగా కనిపిస్తున్నాయి. యాంత్రిక జీవితంలో ప్రతి ఒక్కరూ శరవేగంగా గమ్యం చేరాలని ఉద్దేశంతో ఖరీదైన కార్లు, బైక్‌లు కొనుగోలు చేసి వాటిపై ప్రయాణాలు సాగిస్తున్న ఈ సమయంలోనూ జొన్నగిరికి చెందిన యువకుడు మౌలాలి సోమవారం గుర్రంపై వెళ్తూ కనిపించాడు. పత్తికొండ నుంచి ఓ వివాహానికి గుర్రంపై వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరినట్లు తెలిపారు.



పోతుగల్లు సమీపంలో పత్తి విత్తనాలు నాటేందుకు సాళ్లు తోలుతున్న రైతు

ఊపందుకున్న విత్తన సాగు

కృష్ణగిరి: ఈయేడాది ముందస్తు వర్షాలు రాకతో పుడమి తల్లి ఒడిలో పంటల సాగుతో పల్లెల్లో సందడి నెలకొంది. ఈనెల ప్రారంభం నుంచి వర్షాలు కురవడంతో సేద్యం పనులు ముగించుకున్న అన్నదాతలు రెండు రోజులుగా విత్తనం పనులు ప్రారంభించారు. సోమవారం ఎరుకలచెర్వు, బాపనదొడ్డి, కృష్ణగిరి, ఆగవేళి, పోతుగల్లు తదితర గ్రామాల్లో అన్నదాతలు పంటలు సాగు చేపట్టారు. నల్లరేగడి పొలాల్లో పత్తి గింజలు, ఎర్ర పొలాల్లో ఆముదం, కంది పంటలు సాగులో అన్నదాతలు బిజీగా ఉన్నారు.

నీటి వృథాను అరికట్టండి

హాలహర్వి: మండలంలోని బాపురం రిజర్వాయర్ నుంచి దాదాపు 36 గ్రామాలకు తాగునీరు సరఫరా అయ్యే పైప్‌లైన్ లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. హాలహర్వి నుంచి ఆలూరుకు వెళ్లే మార్గంలో తాగునీటి పైప్‌లైన్ తరచూ పగిలిపోయి నీరు వృథా అవుతోంది. అసలే 15 రోజులకు ఒకసారి నీరు సరఫరా అవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైప్‌లైన్ లీకేజీపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకన్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి తాగునీటి వృథాను అరికట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



హాలహర్వి-ఆలూరు గ్రామాల మధ్య పైపులైన్ లీకేజీ కారణంగా వృథా అవుతున్న తాగునీరు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పత్తికొండ, ఆలూరు
97054 44304 (ఆలూరు, పత్తికొండ)
Office mail : sakshiknladvt@gmail.com